క్లుప్తంగా

అన్నసమారాధన



గుడ్లవల్లేరు: డోకిపర్రు భూ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో భక్తుల తాకిడి అధికమైంది. శనివారం దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు భారీ అన్నసమారాధనను నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మెయిల్ ప్రతినిధి పురిటిపాటి వీరారెడ్డి, విజయలక్ష్మి దంపతుల చేతుల మీదుగా ప్రారంభించారు.

స్వామికి విశేషాభిషేకాలు

స్వామికి విశేషాభిషాకాలతో పాటు ప్రత్యేక పూజలను వేద పండితులు చేపట్టారు. స్వామివారి దర్శనానికి వేలాది మంది భక్తులు బారులు తీరారు.

లబ్ధిదారుల ఎంపికలో అక్రమాలు

గుడివాడ టౌన్: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధాన మంత్రి విశ్వకర్మ పథకం లబ్ధిదారుల ఎంపికలో అక్రమాలు జరుగుతున్నాయని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వద్దాది రాజేష్ అన్నారు. శనివారం ఆయన ట్రస్ట్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. విశ్వకర్మ పథకం లబ్ధిదారులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే కూటమి ప్రభుత్వం విచారణ పేరుతో వాటిని తొలగిస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం వీరిపట్ల వివక్ష చూపుతుందని, ఈ విధానాన్ని విరమించాలని ఆయన డిమాండ్ చేశారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ



పామర్రు: స్థానిక 17వ వార్డులో సీసీ రోడ్ల నిర్మాణానికి ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్ శనివారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు రూ.1,00,10,000తో పామర్రులో 20 సీసీ రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తాడిశెట్టి నరేష్, వైస్ ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు, గ్రామ సర్పంచ్ కె.కస్తూరి, ఎంపీడీఓ జ్యోతి, పీఆర్ ఏఈఈ రామారావు, గ్రామ కార్యదర్శి అబ్దుల్ సలీం, ఎన్ఆర్‌జీఎస్ ఏపీఓ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ లైన్ల ఏర్పాటు పనులు ప్రారంభం



తోట్లవల్లూరు: బొడ్డపాడులో నిరంతర విద్యుత్ సరఫరాకు అవసరమైన చర్యలు చేపట్టినట్లు సర్పంచ్ మూడే శివశంకరరావు తెలిపారు. మండలంలోని బొడ్డపాడులో రూరల్ డెవలప్‌మెంట్ పథకం ద్వారా వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు, ఇంటి కనెక్షన్లను వేరు చేసి, వేరువేరుగా విద్యుత్ సరఫరా చేసేందుకుగాను కొత్త లైన్ల ఏర్పాటు పనులను శనివారం ఆయన ప్రారంభించారు. కొత్త లైన్ల ఏర్పాటు, ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు ద్వారా ప్రజలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా జరిగే అవకాశం ఉందని శివశంకరరావు తెలిపారు. రూ. 50 లక్షల విలువైన పనులు జరగనున్నాయని చెప్పారు.

లభ్యం కాని కార్మికుడి ఆచూకీ

తోట్లవల్లూరు: కృష్ణానదిలో స్నానానికి దిగి గల్లంతైన సెప్టిక్‌ట్యాంక్ కార్మికుడు జగన్నాథం మూర్తి(35) ఆచూకీ ఇంకా లభించలేదు. తోట్లవల్లూరు వద్ద కృష్ణానది పాయలో మద్యం మత్తులో స్నానానికి దిగి శుక్రవారం మూర్తి గల్లంతైన విషయం విదితమే. ఎస్‌డీఆర్ఎఫ్ బృందం స్థానిక కృష్ణానది పాయలో శనివారం గాలింపు జరిపినప్పటికీ ఉపయోగం లేకుండా పోయింది. నదిలో నీటి ఒరవడి ఉన్నందున దిగువకు కొట్టుకుపోయి ఉండవచ్చని స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. గాలింపు చర్యలను పమిడిముక్కల సీఐ చిట్టిబాబు, ఎస్ఐ అర్జునరాజు పర్యవేక్షించారు.

రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ



పామర్రు: టీఎల్ ఎన్ భాగ్యరాజ్ చారిటబుల్ ట్రస్టు సౌజన్యంతో ఆర్ఆర్ఐ హోమియోపతి వైద్యశాలలోని రోగులకు రొట్టెలు, పండ్లను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్టు నిర్వాహకులు జయప్రద మాట్లాడుతూ పేదలైన వారిని ఆదుకోవడంలో ట్రస్టు ఎప్పుడూ ముందు ఉంటుందన్నారు. కార్యక్రమంలో హాస్పిటల్ ఇన్‌చార్జిలు కిషన్, రాజు, హిరణ్ పాల్గొన్నారు.

విద్యుత్ బిల్లుల మోతకు సోలార్‌తో చెక్

విద్యుత్ ఆదాను పెంచేందుకు సబ్సిడీపై పీఎం సూర్య ఘర్ యోజనను కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఈ పథకాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ కూడా కృషి చేస్తున్నారు. సామాన్యులకు విద్యుత్ బిల్లుల మోత బరువును కూడా ఈ పథకంతో తప్పించవచ్చు. ఇంటింటా సోలార్ విద్యుత్ వాడకాన్ని పెంపొందించేందుకు కేంద్ర ప్రభుత్వం రాయితీలు కల్పించింది.



ఇంటిపై ఏర్పాటు చేసిన సోలార్ ప్యానల్స్

సోలార్ రూఫ్ ఏర్పాటు ఖర్చు, సబ్సిడీ వివరాలు

కిలోవాట్లు	ఖర్చు	సబ్సిడీ	యూనిట్లు
ఒకటి	రూ.83 వేలు	రూ.33వేలు	120
రెండు	రూ.1.14 లక్షలు	రూ.60వేలు	240
మూడు	రూ.2.10లక్షలు	రూ.78వేలు	360

- లో ఓల్టేజీ సమస్యలు లేనట్లే..
- సబ్సిడీపై పీఎం సూర్య ఘర్ యోజన

గుడ్లవల్లేరు: సోలార్ పథకం వలన అతి తక్కువ ఖర్చుతో ఇంటికి కావాల్సిన విద్యుత్‌ను పొందవచ్చని ఆ శాఖాధికారులు చెబుతున్నారు. ఇంటి భవనంపై 10 చదరపు అడుగుల స్థలంలో వన్ కిలో వాట్ సామర్థ్యం కలిగిన సోలార్ రూఫ్‌ను ఏర్పాటు చేసుకుంటే విద్యుత్ ఉత్పత్తి చేసి నిల్వ చేసుకునే అవకాశం ఈ పథకం కల్పిస్తోంది. తద్వారా విద్యుత్ ఆదా అవుతుందని విద్యుత్ శాఖ విస్తృత ప్రచారం చేస్తోంది. ఈ పథకంలో భాగంగా బ్యాంకులు తక్కువ వడ్డీతో రుణాలు అందజేసేందుకు సిద్ధంగానే ఉన్నాయి. ఈ పథకం కేవలం గృహ వినియోగదారులకే వర్తిస్తుంది. సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటులో భాగంగా ఒక కిలోవాట్‌తో 120 యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతున్నందున సాధారణంగా రూ.వెయ్యి బిల్లు వచ్చే వినియోగదారుడికి రూ.333 మాత్రమే వస్తుంది. ఇందుకోసం ప్రభుత్వం రూ.30వేల సబ్సిడీ కూడా ఇస్తుంది. రెండు కిలోవాట్‌లతో 240 యూనిట్లు విద్యుత్ ఉత్పత్తి అయితే సాధారణంగా రూ.2వేల బిల్లు వచ్చే వినియోగదారునకు కేవలం రూ.338 మాత్రమే వస్తుంది. ఇందుకోసం కేంద్రం రూ.60వేల రాయితీని అందిస్తుంది. మూడు కిలోవాట్‌లతో 360 యూనిట్లు విద్యుత్ ఉత్పత్తి చేస్తే... సాధారణంగా రూ.3వేల బిల్లు వచ్చే వినియోగదారుడికి చాలా తక్కువ బిల్లు అవుతుంది. దీని కోసం కేంద్రం రూ.78వేల రాయితీని అందిస్తుంది. దరఖాస్తు చేసుకోవాలనుకునేవారు ఏపీఈపీడీసీఎల్ వెబ్‌సైట్ ద్వారా పీఎం సూర్య ఘర్ పోర్టులో దరఖాస్తులు చేసుకోవాలని విద్యుత్ అధికారులు కోరుతున్నారు.

సూర్య ఘర్ యోజనను ఇలా పొందాలి



పీఎం సూర్య ఘర్ యోజన యాప్‌ను మొబైల్‌లో ఇన్‌స్టాల్ చేసుకోవచ్చు. గతంలో విద్యుత్‌కు సంబంధించిన ఆరు నెలల బిల్లులను జత చేయాలి. అవసరమైన కిలోవాట్‌ల ఆధారంగా రిజిస్ట్రేషన్ ఫీజును చెల్లించాలి. మూడు కిలోవాట్‌ల లోపు సర్వీస్‌కు ఎలాంటి రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాల్సిన అవసరం లేనట్లే. ఆన్‌లైన్‌లో వినియోగదారుడు వివరాలను నమోదు చేసుకోవచ్చు. ఈ పథకాన్ని పొందేందుకు గృహ వినియోగదారులు వాడే విద్యుత్ యూనిట్లు 300లోపే ఉండాలి. ఐదు కిలోవాట్‌లకు రూ.1,900 ఆపై రూ.5,900 చెల్లించాలి. 10 కిలోవాట్‌ల పైబడిన హెచ్‌టీ సర్వీసులకు రిజిస్ట్రేషన్ ఫీజు రూపంలో రూ.11,900 చెల్లించాల్సి ఉంటుంది. సబ్సిడీ పోను మిగిలిన మొత్తానికి బ్యాంకు రుణ సదుపాయాన్ని కల్పిస్తాయి. వాయిదాల పద్ధతిలో చెల్లించేందుకు వెసులుబాటు ఉంటుంది. ఈ పథకంపై అన్ని చోట్లా అవగాహన కల్పిస్తున్నాం. విద్యుత్ బిల్లు ఆదాతో పాటు కలిగే ప్రయోజనాలను అవగాహన పరుస్తున్నాం. ఆసక్తి గల వినియోగదారులు వారి ప్రాంతంలోని సెక్షన్ కార్యాలయాల్లో సంప్రదిస్తే పూర్తి వివరాలు తెలియజేస్తారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నాం.

– ఎం.సత్యానందం, విద్యుత్ ఎస్ఈ, మచిలీపట్నం

ధ్యానంతో మానసికోల్లాసం

గుడ్లవల్లేరు: ధ్యానంతో ఆరోగ్యంతో పాటు మానసికోల్లాసం కలుగుతుందని జిల్లా లయన్స్ మాజీ గవర్నర్ వై.పి.సి.ప్రసాద్ అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు వారి ఆధ్వర్యంలో శనివారం స్థానిక లయన్స్ సేవా భవన్‌లో ఉచిత ధ్యాన శిక్షణను భీమవరానికి చెందిన గురువు శ్రీనివాస్ ఇచ్చారు. లయన్స్ చైర్మన్ శశికళ, కార్యదర్శి ఎం.పెరుమాళ్లు పాల్గొన్నారు.

తాగునీరు అందించేందుకు చర్యలు

గుడివాడరూరల్: నియోజకవర్గంలోని ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఇటీవల కంకిపాడులో జరిగిన పల్లెపండుగలో నియోజకవర్గంలో తాగునీటి సమస్య గురించి ఎమ్మెల్యే వెనిగండ్ల రాము డెప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించి, మూడు మండలాల్లో తాగునీటి పరీక్షలు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ క్రమంలో శనివారం నందివాడ మండలంలో 12 పనులు గుర్తించి రూ.91 లక్షలను ప్రభుత్వం తాగునీటికి కేటాయించింది. ఈ పనులను వీలైనంత త్వరగా మొదలు పెట్టాలని డెప్యూటీ సీఎం అధికారులను ఆదేశించారు. మొదట నందివాడ మండలంలోని ఎల్ఎన్ పురం, జనార్ధనపురం, జనార్ధనపురం(హెచ్ డబ్ల్యూ), కుదరవల్లి, పెదవిరివాడ, పొనుకుమాడు, వెన్ననపూడి, రామాపురం, ఇలపర్రు, నందివాడ గ్రామాల్లో ఫిల్టర్‌బెడ్లు, సరఫరాలో లోపం లేకుండా పనులు చేయాలని నిశ్చయించి జిల్లా కలెక్టర్ బాలాజీ నిధులు మంజూరు చేశారు.

హాస్టళ్ల విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ



గుడివాడ హాస్టల్లో తనిఖీ చేస్తున్న జిల్లా జడ్జి జి.సుబ్రహ్మణ్యం



మొవ్వలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న జడ్జి కేవీ రామకృష్ణయ్య

గుడివాడ టౌన్: ప్రభుత్వ హాస్టళ్ల విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని 11వ అదనపు జిల్లా జడ్జి జి.సుబ్రహ్మణ్యం అన్నారు. ఆయన స్థానిక లింగవరం రోడ్‌లోని ప్రభుత్వ ఎస్సీ కళాశాల బాలికల వసతి గృహంలో శనివారం తనిఖీలు నిర్వహించారు. భవనంలో గల లోపాలను గుర్తించి తక్షణమే వాటిని మరమ్మతులు చేయించాలన్నారు. కార్యక్రమంలో మండల లీగల్ సర్వీసెస్ కమిటీ సభ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

న్యాణత లోపిస్తే సహించేది లేదు

మొవ్వ: విద్యార్థులకు అందించే ఆహార పదార్థాల్లో నాణ్యత లోపిస్తే సహించేది లేదని, మెనూ ప్రకారం సకాలంలో ఆహారం అందించాలని కృష్ణా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కేవీ రామకృష్ణయ్య సూచించారు. స్థానిక శ్రీ మండవ కనకయ్య జెడ్పీ ఉన్నత పాఠశాల్లో మధ్యాహ్న భోజనాన్ని జడ్జి కేవీ రామకృష్ణయ్య శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ప్రతి నెలా జిల్లాలోని పాఠశాలల్లో తనిఖీలు నిర్వహిస్తామని తెలిపారు. విద్యార్థుల సమస్యలు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

మండవల్లిలో..

మండవల్లి: మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ వీవీఎన్‌వీ లక్ష్మి మండవల్లి సామాజిక సంక్షేమ బాలికల, బాలుర వసతి గృహాలను శనివారం తనిఖీ చేశారు. కార్యక్రమంలో ప్యానల్ అడ్వొకేట్లు పి.పవన్‌కాంత్, డి.శివప్రసాద్, బీసీ, సామాజిక సంక్షేమ హాస్టల్ వార్డెన్లు, సిబ్బంది, ఎమ్ఎల్ఎస్‌సీ సిబ్బంది, పీఎల్‌వీ పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు



గురజాడలో రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే కుమార్ రాజా

పమిడిముక్కల: గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే వర్ల కుమారరాజా అన్నారు. పల్లె పండుగ-పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా మర్రివాడలో రూ.23.6 లక్షల వ్యయంతో నిర్మించనున్న నాలుగు సీసీ రోడ్లకు, గురజాడలో రూ.21 లక్షలతో నిర్మిచనున్న 5 సీసీ రోడ్లకు, తాడంకిలో రూ.50 లక్షలతో నిర్మించనున్న 10 సీసీ రోడ్లకు, కపిలేశ్వరపురంలో రూ.40 లక్షలతో నిర్మించనున్న 5 సీసీ రోడ్లకు శనివారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఎంపీడీఓ విశల్‌పాల్, పీఆర్ ఏఈ పృథ్వీరాజ్, సర్పంచ్‌లు వి.ఫ్రాన్సిస్, ధనలక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు శ్రీలక్ష్మి, టీడీపీ నాయకుడు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అవినీతి అంతంతోనే దేశాభివృద్ధి



విద్యార్థులకు బహుమతులు అందజేసిన బ్యాంకు మేనేజర్ హరిబాబు

తోట్లవల్లూరు: దేశం అభివృద్ధి సాధించాలంటే అవినీతి అంతం కావాలని తోట్లవల్లూరు యూనియన్ బ్యాంక్ మేనేజర్ హరిబాబు అన్నారు. మండలంలోని వల్లూరుపాలెం జెడ్పీ పాఠశాల్లో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారి ఆధ్వర్యంలో విజిలెన్స్ అవగాహన వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు శనివారం అవినీతి నిర్మూలనపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు బ్యాంకు మేనేజర్ హరిబాబు, ఇన్‌చార్జి హెచ్‌ఎం.నాగమల్లీశ్వరి బహుమతులను అందజేశారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఉపాధ్యాయులు రాజేశ్వరి, మణి, బ్యాంకు ప్రతినిధి శేఖర్ పాల్గొన్నారు.

ముందస్తు అనుమతులు తప్పనిసరి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐలు

కైకలూరు: టపాసుల దుకాణాలకు వ్యాపారులు ముందస్తు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని రూరల్ సర్కిల్, టౌన్ సీఐలు వి.రవికుమార్, పి.కృష్ణ పేర్కొన్నారు. సీఐ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ దీపావళి నేపథ్యంలో కైకలూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో బాణసంచా విక్రయ దుకాణాలు ఏర్పాటు చేయనున్నారన్నారు. అగ్నిమాపక, రెవెన్యూ, పోలీసు శాఖలు జాయింట్ కమిటీగా వీటిని అనుమతిస్తామన్నారు. టపాసుల విక్రయాలు మూడు రోజుల అనుమతులకు ఆధార్ కార్డుతో రూ.500 రెవెన్యూ అధికారులకు అర్జీ రూపంలో చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఎవరైనా లైసెన్సులు లేకుండా దుకాణాలు తెరిచిన, మందుగుండు సామగ్రిని నిల్వ చేసినా క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రూరల్ ఎస్ఐ రాంబాబు పాల్గొన్నారు.

టపాసుల విక్రయాల వద్ద జాగ్రత్తలు పాటించాలి

గుడివాడరూరల్: దీపావళిని పురస్కరించుకుని టపాకాయిలు విక్రయించే హోల్‌సేల్ వ్యాపారులు అన్ని జాగ్రత్తలతో పాటు పోలీసుల సూచనలు కూడా పాటించాలని గుడివాడ తాలూకా ఎస్ఐ ఎస్.చంటిబాబు సూచించారు. మల్లాయపాలెం పరిధిలోని టపాసుల హోల్‌సేల్ షాపును శనివారం ఆయన పరిశీలించి అనుమతులు, ఇతర వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ఉచిత నేత్ర వైద్య చికిత్స



గుడ్లవల్లేరు: లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక లయన్స్ సేవా భవన్‌లో ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని శనివారం నిర్వహించారు. గుడివాడ లయన్స్ కంటి ఆస్పత్రి వారు ఈ పరీక్షలను చేశారు. కొల్లి రాజేష్ ఆర్థిక సాయంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారని లయన్స్ చైర్మన్ నిమ్మగడ్డ శశికళ తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ ప్రతినిధులు కోలా రాధాకృష్ణ, నాగేశ్వరరావు, పి.విజయ్ పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



గుడ్లవల్లేరు: మండలంలోని కూచికాయలపూడి-పోలిమెట్ల-శేరీ కల్వపూడి వరకు బీటీ రోడ్డు పనులను గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము శనివారం ప్రారంభించారు. ఈ రోడ్డును రూ.1.21కోట్ల నిధులతో నిర్మిస్తున్నామని తెలిపారు. తహసీల్దార్ లోకరాజు, పీఆర్ డీఈ రవి, ఏఈ నాగేశ్వరరావు, కూటమి నాయకులు శ్రీకాంత్, శ్రీనివాసరరావు, వెంకట్రావు, రామరాజు, రవి, ప్రసాద్, చిట్టిబాబు, ఆంజనేయులు, చిట్టిబాబు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం

గుడ్లవల్లేరు: ప్రజా సమస్యల పరిష్కారమే తమ ప్రభుత్వ ధ్యేయమని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. శనివారం మండలంలోని విన్నకోట, అంగలూరు, చంద్రాల, శేరీ కల్వపూడి, పోలిమెట్ల, కూచికాయలపూడిలో జరిగిన పల్లె పండుగకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. తహసీల్దార్ బి.లోకరాజు, కూటమి నాయకులు శ్రీకాంత్, శ్రీనివాసరావు, వెంకట్రావు పాల్గొన్నారు.

మండవల్లిలో..

మండవల్లి: మండలంలోని ఇంగిలిపాకలంక, నాగభూషణపురం, గురువెల్లిపేటలో పల్లె పండుగ పురస్కరించుకుని సిమెంట్ రోడ్ల నిర్మాణానికి శనివారం శంకుస్థాపన చేశారు. చావరాల దుర్గాప్రసాద్ ఆధర్యంలో జెడ్పీటీసీ సభ్యురాలు విజయనిర్మల, సర్పంచ్ రత్నకుమారి, సత్తిబాబు, సంపత్‌కుమార్, రంగారావు, సురేష్‌బాబు, భాస్కరరావు, అచ్చిరాజు పాల్గొన్నారు.

క్షీరబంధు పథకంతో లబ్ధి



పామర్రు: క్షీరబంధు పథకం పాల ఉత్పత్తిదారులకు లబ్ధి చేకూరుతుందని పామర్రు పాల శీతల కేంద్రం మేనేజర్ సీహెచ్ గోపీనాథ్ పేర్కొన్నారు. పామర్రు క్లస్టర్ పరిధిలోని పొలింకి పాడులోని లబ్ధిదారులకు ఈ పథకం ద్వారా చెక్కును శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనివార్యకారణాలతో పాల కేంద్రానికి పాలుపోసే రైతు మృతి చెందితే ఆ కుటుంబానికి రూ.50వేలను కృష్ణామిల్క్ యూనియన్ ద్వారా అందజేస్తామన్నారు. కృష్ణామిల్క్ యూనియన్ జిల్లా ట్రస్టు బోర్డు డైరెక్టర్ బొమ్మారెడ్డి కృష్ణారెడ్డి చేతుల మీదుగా బాధితురాలికి రూ.50వేల చెక్కును అందజేశామని తెలిపారు.

26 నుంచి రీసర్వే గ్రామసభలు

మండవల్లి: మండలంలో ఈ నెల 26 నుంచి రీసర్వే గ్రామసభలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ కె గోపాల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 26న ప్రత్తిపాడు, భైరవపట్నం, 29న చావలిపాడు, లోకుమూడి, 30న సింగనపూడి, నవంబర్ ఒకటో తేదీన మూడుతాళ్లపాడు, 2న శోభనాద్రిపురం, అప్పాపురం, 5న అయ్యవారిరుద్రవరం, 6న మండవల్లి, 7న గన్నవరం, మొఖాసాకలవపూడి, 8న లింగాల 12న కానుకొల్లు, 13న చింతలపూడి, పుట్లచెరువు, 14న పసలపూడి, లేళ్ళపూడి గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

మ్యాథ్స్‌బీ పోటీ పరీక్షలకు విశేష స్పందన



గౌతమ్ స్కూల్లో పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

గుడివాడ టౌన్ : సాక్షి మీడియా ఆధ్వర్యంలో పట్టణంలోని కేకేఆర్ గౌతమ్ స్కూల్, విద్యాలయ ఇంగ్లిష్ మీడియం స్కూల్లో శనివారం నిర్వహించిన మ్యాథ్స్‌బీ పరీక్షలకు విశేష స్పందన లభించింది. మొదటి దశ పరీక్షలలో విద్యాలయ పాఠశాల నుంచి 127 మంది, గౌతమ్ పాఠశాల గుడివాడ శాఖ నుంచి 496 మంది విద్యార్థులు పరీక్షల్లో పాల్గొన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా ఉన్న అన్ని గౌతమ్ పాఠశాలల విభాగాల నుంచి 1986 మంది విద్యార్థులు పాల్గొన్నారు. విద్యాలయ ప్రిన్సిపాల్ బొప్పన విజయభాస్కర్, డైరెక్టర్ బొప్పన శాంతి, కేకేఆర్ గౌతమ్ స్కూల్ ప్రిన్సిపాల్స్ సత్యారామ్, కె.జ్యోతి, ప్రశాంతి, కాంపిటేటివ్ ఎగ్జామ్స్ కో-ఆర్డినేటర్ పి.అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రోత్సహించే పోటీలు



సాక్షి యాజమాన్యం నిర్వహిస్తున్న మ్యాథ్స్‌బీ పోటీలు మంచి ఫలితాలు ఇస్తున్నాయి. ఈ పరీక్షలు విద్యార్థులను ప్రోత్సహించే విధంగా ఉన్నాయి. రాష్ట్ర స్థాయి పోటీల్లో సైతం మా విద్యార్థులు విజేతలుగా నిలుస్తున్నారు.

– పి.లక్ష్మీ ప్రసాద్, ప్రిన్సిపాల్, కేకేఆర్ గౌతమ్ స్కూల్

లెక్కలంటే ఇష్టం పెరిగింది



ఈ పరీక్షల్లో పాల్గొనే ముందు ఇచ్చిన మెటీరియల్ మాకు లెక్కలపై ఇష్టాన్ని పెంచింది. లెక్కలు చేయడం తెలుస్తోంది. ఇక జరిగే పై స్థాయి పోటీల్లో కూడా తప్పక విజయం సాధిస్తా.

– పి.మనస్వి, కేకేఆర్ గౌతమ్ స్కూల్ విద్యార్థిని

సబ్జెక్ట్‌పై పట్టు వస్తుంది



లెక్కలు సబ్జెక్ట్‌పై ఆసక్తి పెరిగింది. సులువుగా లెక్కలు అర్థం చేసుకోవడం ఎలాగో ఈ పరీక్షల ద్వారా తెలుసుకోగలుగుతున్నాం. మా సామర్థ్యాన్ని కూడా పరీక్షించుకోడానికి ఇదిఒక మార్గం.

– జె.ఇషామ్‌రెడ్డి, కేకేఆర్ గౌతమ్ స్కూల్ విద్యార్థి

మెలకువలు నేర్చుకుంటున్నాం



ఈ పరీక్షలకు సిద్ధపడేందుకు ఇస్తున్న మెటీరియల్ ద్వారా లెక్కలు అభ్యాసనం చేసే మెలకువలు నేర్చుకున్నా. సులువుగా సమస్యను పరిష్కరించుకోడానికి కూడా ఈ పోటీ పరీక్షలు ఉపయోగపడ్డాయి.

– ఎస్.పద్మశ్రీ, విద్యాలయ స్కూల్ విద్యార్థిని

సంక్షిప్త వార్తలు

వాహనాల తనిఖీ

మండవల్లి: మండలంలోని చావలిపాడు వద్ద శనివారం పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ శ్రీరామచంద్రమూర్తి వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. రికార్డులు సక్రమంగా ఉండాలని, అతివేగం పనికిరాదని, పరిమితికి లోబడి ప్రయాణికులను ఎక్కించుకోవాలన్నారు. నిబంధనలు పాటించని వాహనదారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నేడు ఉచిత వైద్య పరీక్షలు

గుడివాడ టౌన్: లయన్స్‌క్లబ్ ఆఫ్ గుడివాడ, మానవతా స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో ఆదివారం మెగా ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అను గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ విజయవాడ వైద్య బృందం స్థానిక కాకర్ల వీధిలోని గౌతు లచ్చన్న విగ్రహం వద్ద ఉదయం తొమ్మిది గంటల నుంచి శిబిరం ఉంటుందని పేర్కొన్నారు.

రేపు ఉచిత కంటి వైద్యశిబిరం

పమిడిముక్కల: మండల విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో మాక్సివిజన్ కంటి ఆస్పత్రి విజయవాడ సహకారంతో వీరంకిలాకులో సోమవారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు బండ్రపల్లి యేబు, బొల్లా వెంకటేశ్వరరావు తెలిపారు. వీరంకిలాకు సంతాన సాయిబాబా సేవా మందిరంలో వైద్యశిబిరం జరుగుతుందని పేర్కొన్నారు.

మధ్యాహ్న భోజనంపై పర్యవేక్షణ చేయాలి

గుడ్లవల్లేరు: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థుల తల్లిదండ్రుల కమిటీల వారు పర్యవేక్షణ చేయాలని ఎంఈఓలు జి.గోపాలరావు, జగన్‌మోహనరావు తెలిపారు. గుడ్లవల్లేరు మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండలంలోని పాఠశాలల హెచ్‌ఎంలకు సమావేశాన్ని నిర్వహించారు.

ఘనంగా అట్లతద్ది వేడుకలు

కూచిపూడి(మొవ్వ): మొవ్వ మండలంలో అట్లతద్ది వేడుకలను ఆడపిల్లలు, మహిళలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఊయలలు ఊగుతూ.. గోరింటాకు పెట్టుకుంటూ ఉత్సాహంగా జరుపుకున్నారు. అలాగే చంద్రోదయ ఉమావ్రతం వాయినాలను ఇచ్చిపుచ్చుకున్నారు.

రీసర్వే గ్రామసభలు

ముదినేపల్లి రూరల్ : మండలంలోని పెదకామనపూడి, చిగురుకోట, వడాలి గ్రామాల్లో శనివారం రీసర్వే గ్రామసభలు నిర్వహించారు. ఈ సభల్లో తహసీల్దార్ సుభానీ మాట్లాడుతూ అర్జీలను పరిశీలించి న్యాయసమ్మతమైనవాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. నియోజకవర్గ టీడీపీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు వడాలి, వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహం తొలగింపుపై ఎస్సీల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న ఎస్సీలు

ముదినేపల్లి రూరల్: జాతీయ రహదారి విస్తరణ పేరుతో అంబేడ్కర్ విగ్రహాన్ని తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ విగ్రహ కమిటీ సభ్యులు, ఎస్సీలు శనివారం ధర్నా చేశారు. అనంతరం ఈ ఘటనపై తహసీల్దార్ సుభానీకి, స్థానిక పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు నిమ్మగడ్డ భిక్షాలు మాట్లాడుతూ జాతీయ రహదారి అధికారులు రోడ్డు కాంట్రాక్టర్ సిబ్బంది గతంలో తనతో పాటు విగ్రహ కమిటీ సభ్యులైన సోమల వరప్రసాద్, కారే కోటేశ్వరరావు, పల్లెం పుల్లేశ్వరరావు, పుట్టి నరసింహారావు తహసీల్దార్ సమక్షంలో హైవే అధికారులతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపారు. తమకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా విగ్రహాన్ని తొలగించినవారిపై చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో కోరారు. సర్పంచ్ నిమ్మగడ్డ కైకమ్మ తదితరులు పాల్గొన్నారు.